క్లుప్తంగా

దుర్గాదేవికి కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న భవానీ మాలధారులు

కె.కోటపాడు: డి.అగ్రహారంలో దుర్గాదేవి అమ్మవారికి భవానీ మాలధార భక్తులు శనివారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వచ్చే నెల 11వ తేదీ వరకూ ఇక్కడ దుర్గాదేవి మండపం వద్ద నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దుర్గాభవానీ సేవా పీఠం భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేచలపు పైడంనాయుడు, లెక్కల నాయుడు(సామిల్లు), లెక్కల ముత్యాలనాయుడు, బల్లంకి చంద్రరావు, రెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



బాబూరావును యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న గణేష్

గొలుగొండ: రావణాపల్లి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మడగల బాబూరావును మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం పరామర్శించారు. బాబూరావు ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో అతని ఇంటికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరగా స్వస్థత చేకూరాలని కోరుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, చోద్యం పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పెద్దిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, సీనియర్ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒమ్మలిలో వినాయక నిమజ్జనోత్సవం

మాడుగుల రూరల్: ఒమ్మలి జగదాంబ సెంటర్ వద్ద శ్రీముఖలింగేశ్వర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా నేల వేషాలు, బిందెలు నృత్యాల మధ్య స్వామివారి విగ్రహా ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. రాత్రికి బుర్రకథ, తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

3 నుంచి అష్టలక్ష్మి కుంకుమ పూజలు



కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి శరనవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అష్టలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 12వ తేదీ వరకు ఉదయం నుంచి అష్టలక్ష్మి కుంకుమ పూజలు, అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. దాతలు విరాళాలు అందించాలని కోరారు.

వారం రోజుల్లో ఇద్దరు శిశువుల మృతి



పులుసుమామిడిలో మృతిచెందిన శిశువు

జి.మాడుగుల: జిల్లాలో మాతా శిశు మరణాలు ఆగడం లేదు. అనారోగ్యం తదితర కారణాలతో మృత్యువాతపడుతున్నారు. మండలంలో బొయితిలి పంచాయతీ పులుసు మామిడి గ్రామంలో వారం రోజుల వ్యవధిలో అనా రోగ్యంతో ఇద్దరు శిశువులు మృతిచెందారు. ఈ నెల 22న తోటపల్లి లక్ష్మీపతికి కుమార్తె (4 నెలలు) మృతి చెందగా, ఆదివారం తరడా రమేష్‌కు కుమారుడు (3నెలలు) మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. వరుసగా శిశు మరణాలు సంభవిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు, వైద్యశాఖ అధికార్లు వెంటనే స్పందించి శిశు మరణాలను నివారించాలని సర్పంచ్ మాలన్న, గ్రామస్తులు కోరారు.



నిరుపయోగంగా నూతన సచివాలయం-2 భవనం



సిబ్బంది విధులు నిర్వహిస్తున్న శిథిలావస్థ కల్యాణ మండపం ఇదే..

సొంత గూటికి ఇంకెప్పుడు?

- రూ.40 లక్షలతో దేవరాపల్లి సచివాలయం-2 భవనం పూర్తి
- రాజకీయ విభేదాలతో నిరుపయోగంగా భవనం
- శిథిల కల్యాణ మండపంలోనే సిబ్బంది విధులు

దేవరాపల్లి: స్థానిక గ్రామ సచివాలయం-2 భవనానికి రాజకీయ గ్రహణం పట్టింది. ఇక్కడ టీడీపీ నాయకుల మధ్య నెలకొన్న వైషమ్యాలతో తొమ్మిది నెలల క్రితం ప్రారంభోత్సవం పూర్తి చేసుకున్న భవనంలోకి సిబ్బంది వెళ్లే సాహసం చేయలేకపోతున్నారు. పర్యవసానంగా శిథిలావస్థకు చేరిన కల్యాణ మండపంలో ఇరుకు గదులో ఇక్కట్లకు గురవుతూ సేవలందించాల్సిన దుస్థితి నెలకొంది.

దేవరాపల్లిలో సచివాలయం-2 భవనాన్ని రూ. 40 లక్షలతో నిర్మించారు. సకల సదుపాయాలతో సర్వాంగ సుందరంగా నిర్మించిన దీన్ని 9 నెలల క్రితమే ప్రారంభోత్సవం సైతం చేశారు. నెలలు గడుస్తున్నా నూతన భవనంలోకి అడుగు పెట్టేందుకు అధికారులు ప్రయత్నించడం లేదు. శిథిలావస్థకు చేరిన కల్యాణ మండపంలో విధులు నిర్వహించడం పలువుర్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న కల్యాణ మండపంలో కంప్యూటర్లు పెట్టుకునేందుకు చిన్నపాటి గది మాత్రమే సిబ్బందికి దిక్కు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవరాపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం-1, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాల్లో ఆయా సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా, సచివాలయం-2 భవనంలోకి అధికారులు మాత్రం వెళ్లేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వాస్తవంగా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి ఒత్తిడి ఉండటంతోనే నూతన భవనంలోకి వీరు వెళ్లేందుకు సాహసించడం లేదని విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనంలోకి సచివాలయం-2 సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

• రాజకీయ కార్యాలయంగా సచివాలయ కేంద్రం..

ప్రస్తుతం గ్రామ సచివాలయ సేవల కోసం తాత్కాలికంగా వినియోగిస్తున్న స్థానిక కల్యాణ మండపాన్ని రాజకీయ పార్టీ కార్యాలయంగా మార్చేశారు. అక్కడ అధికార టీడీపీ, బీజేపీ నాయకుల ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు దర్శనమిస్తున్నాయి. వివిధ సేవలు నిమిత్తం అక్కడకు వస్తున్న ప్రజలు వీటిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఇది రాజకీయ పార్టీ కార్యాలయమా? లేక సచివాలయ కేంద్రమా అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అవి అధికార పార్టీకి చెందినవి కావడంతో సచివాలయ సిబ్బంది వాటిని తొలగించే సాహసం చేయలేకపోతున్నారు.



సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న కల్యాణ మండపంలో రాజకీయ పార్టీల జెండాలు

క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు



దేవరాపల్లి సచివాలయం-2 నూతన భవనం ఉండగా, కళ్యాణ మండపంలో సిబ్బంది విధులు నిర్వహించడం సరికాదు. దీనిపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి నూతన భవనంలో విధులు నిర్వర్తించేలా చర్యలు చేపడతాను.

– ఎం.వి. సువర్ణరాజు, ఎంపీడీవో, దేవరాపల్లి

అధ్వానంగా దారమఠం రోడ్డు



గోతులతో దారమఠం రోడ్డు

గొలుగొండ: ప్రముఖ శైవక్షేత్రమైన దారమఠం రోడ్డు అధ్వానంగా మారింది. గొలుగొండ నుంచి దారమఠం రోడ్డుపై వెళ్లేందుకు పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు సరిగ్గా లేకపోవడంతో వాహనదారులు రాకపోకల సమయంలో అవస్థలకు గురవుతున్నారు. ఈ మార్గంలో పలు చోట్ల పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనాలు పల్టీ కొడుతున్నాయి. రోడ్డు అభివృద్ధికి అధికారులుగానీ స్థానిక ఎమ్మెల్యేగానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వచ్చే కార్తీకమాసంలో వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి రానున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌పై వ్యాఖ్యలు హాస్యాస్పదం

బహిరంగ చర్చకు రావాలని ఎస్సీ సెల్ విభాగం నాయకుడు ఈశ్వరరావు సవాల్



ఈశ్వరరావు

నర్సీపట్నం: టీడీపీ నాయకుడు దనిమిరెడ్డి మధు కనీస జ్ఞానం లేకుండా మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌పై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ విభాగం నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావు విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గణేష్ హయాంలో ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తూ ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేశారన్నారు. ఎవరి హయాంలో దేవాలయాలు ఎక్కువగా అభివృద్ధి చెందాయో తేల్చుకునేందుకు ముఖాముఖి చర్చకు రావాలని మధుకు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ హయాంలో నర్సీపట్నంలోని నూకాలమ్మ ఆలయాన్ని రూ.40 లక్షలతోను, వీరబ్రహ్మంగారి ఆలయం, గొలుగొండ మండలంలోని నూకాలమ్మతల్లి ఆలయాన్ని అభివృద్ధి చేశారన్నారు. టీటీడీతో మాట్లాడి నర్సీపట్నం నియోజకవర్గంలో 200 ఆలయాలకు రూ.20 కోట్లు మంజూరు చేయించిన ఘనత మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో ఆధ్యాత్మికంగా ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. తిరుమల తిరుపతి లడ్డూ విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఏ కల్తీ జరిగినా కూటమి ప్రభుత్వంలోనే జరిగింది కదా అని ప్రశ్నించారు. దీనిని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపైకి నెట్టేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కూటమి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వంద రోజుల్లో ప్రజలకు ఏమీ చేయలేక, వారి తిట్లు భరించలేక కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామితో పెట్టుకున్నారంటే సర్వనాశనం అయిపోతారని హెచ్చరించారు. తప్పులన్నీ కూటమి ప్రభుత్వం చేసి సూపర్ సిక్స్ మరిచిపోయేలా చేస్తున్నారని విమర్శించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

రోలుగుంట: బలిజపాలెం గ్రామానికి చెందిన నూకాలమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆదివారం చోడవరంలో అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆర్థికంగా ఇబ్బందులు పడటంతో రూ. 26 వేలు మంజూరయ్యాయి. ఈ మొత్తం చెక్కును మాజీ వైస్ ఎంపీపీ లోవరాజు, మాజీ సర్పంచ్ సేనాపతి ఆదినారాయణల సమక్షంలో ఎమ్మెల్యే అందజేశారు.

పర్తియాత్ర విజయవంతం చేయండి



సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల: సాయి మహిమను తెలుసుకోవాలని సత్యసాయి జిల్లా సేవా సమితి అధ్యక్షుడు అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక సాయి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. వచ్చే నెల 23, 24, 25 తేదీల్లో అనకాపల్లిలో ప్రశాంతి పర్తియాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సాయి భక్తులు రాజుకొండ, శ్రీను, పుట్టా బలరామ్, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

కొద్ది నిమిషాలు గడిస్తే తండ్రి కూతురును చూసేవాడు... మరో వ్యక్తి తన గమ్యాన్ని చేరేవాడు. అంతలోనే మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చి వారి ప్రాణాలు బలిగొంది.. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రావణాపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు.



మరణించిన రాజుబాబు



ప్రమాద స్థలంలో అప్పన్న స్వామి



రోడ్డు కిందకు పోయిన కారు

- రావణాపల్లి వద్ద బైక్‌ను ఢీకొన్న కారు
- ఇద్దరి మృతి
- కూతురి దగ్గరకు వెళ్లకుండానే తండ్రి తిరిగిరాని లోకాలకు ..

కొయ్యూరు: రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కూతురు రేష్మాను ఇంటికి తీసుకువచ్చేందుకు రాజేంద్రపాలెంకు చెందిన అంబటి అప్పన్న స్వామి(38) ఆదివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ ఎరకంపేటకు చెందిన యాదగిరి రాజుబాబు(58) కూడా అక్కడ వరకు వస్తానని స్వామి బైక్ ఎక్కాడు. రావణాపల్లి సమీపంలో రేగడివీధి జంక్షన్ వరకు బాగానే వెళ్లారు. కొద్ది నిమిషాల్లో రావణాపల్లి వెళ్తారనగా కృష్ణదేవిపేట నుంచి అతి వేగంగా వచ్చిన కారు చింతాలమ్మ గుడికి ఎదురుగా బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ వెనుక సీటుపై ఉన్న రాజుబాబు సుమారు పది మీటర్ల దూరంలో పడి మృతి చెందాడు. తీవ్ర గాయాలైన స్వామికి కృష్ణదేవిపేట ఆస్పత్రిలో చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. చింతాలమ్మ గుడికి వెళ్లేందుకు కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఒకరు గాయపడడంతో నర్సీపట్నం తరలించారు.

కన్నీరుమున్నీరుగా..:

మరణించిన అంబటి స్వామి ఇక్కడ వైస్ ఎంపీపీ అంబటి నూకాలుకు స్వయాన సోదరుడు. స్వామికి భార్య దేవి, కూతురు రేష్మా, కొడుకులు సుశాం ఉన్నారు. తండ్రి మరణ వార్త విన్న వారంతా తీవ్రంగా రోదించారు. స్వామి గతంలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇప్పుడు వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్వామి మరణించడంతో తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు. ప్రమాదంలో మరణించిన రాజుబాబు ఏజెన్సీ ప్రాంతంలో కోళ్లను కొనుగోలు చేసి మైదాన ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు.



అప్పన్న స్వామి (ఫైల్)



రాజుబాబు (ఫైల్)

త్.లక్ష్మీతేజ

ఆదివారం కొయ్యూరు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. నిర్లక్ష్యంగా కారు నడిపి ఇద్దరి మరణానికి కారణమైన డ్రైవర్ రమణను కొయ్యూరు పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

అనకాపల్లి: వ్యాయామంతో ఆరోగ్యంగా జీవించవచ్చని వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ వైద్యుడు డి.డి.నాయుడు అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం లాంగ్ వాకింగ్ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణతో అనకాపల్లి షాప్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా తరువాత ప్రతి వ్యక్తికి వ్యాయామంపై ఆసక్తి పెరిగిందన్నారు. దూమపానం, మద్యపానం, ఒత్తిడి, వ్యాయామం చేయకపోవడం వల్ల హార్ట్ ఎటాక్ వస్తుందన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడికి సన్మానం



బూడిని దుశ్శాలువా, జ్ఞాపికతో సన్మానిస్తున్న కోటి, వెంకటరావు, తదితరులు



బూడిని కలిసి అభినందనలు తెలుపుతున్న తాంద్ర పాపారాయుడు వెలమ సంఘం సభ్యులు

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును రొంగలినాయుడుపాలెం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం తారువలో బూడి ముత్యాలనాయుడును వీరు మర్యాద పూర్వకంగా కలిశారు. బూడి నియామకం పట్ల పార్టీ సీనియర్ నాయకులు పైల కోటేశ్వరరావు, యడ్ల వెంకటరావు, గొంద్రుపోటు పైడంనాయుడు, రొంగలి సత్యనారాయణ, వాకాడ జగ్గునాయుడు, జూరెడ్డి అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బూడిని దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపిక బహూకరించారు. వీరితో పాటు కాకినాడకు చెందిన తాంద్ర పాపారాయుడు వెలమ సంక్షేమ సంఘం నాయకులు చొక్కాకుల మోహన స్వామి, బీల సత్తిబాబు, యడ్ల లోవప్రసాద్, యడ్ల రామసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



బూడిని అభినందిస్తున్న భాస్కరరావు తదితరులు

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బూడి ముత్యాలునాయుడుకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం తారువ క్యాంపు కార్యాలయంలో ఒమ్మలి పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి బొద్దాపు భాస్కరరావు, నాయకులు కలిసి సన్మానించారు. వీరితో పాటు ఎం.కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'పొలం పిలుస్తోంది'

మాడుగుల రూరల్: మండలంలో అక్టోబరు, నవంబర్, డిసెంబర్ మాసాలకు సంబంధించి పొలం పిలుస్తోంది కార్యక్రమం షెడ్యూల్ ప్రకటించినట్టు ఏవో ఎం. వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం రోజుకు రెండు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పొలాల పరిశీలన, రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. అక్టోబరు 1న జి. అగ్రహారం, వీరనారాయణం, 3న ముకుందపురం, ఎం. కోటపాడు, 8న సాగరం, ఎం. కోడూరు, 9న తాటిపర్తి, శంకరం 15న జె.డి.పేట, పొంగలిపాక, 16న ఎల్. పొన్నవోలు జాలంపల్లి, 22న కింతలి వల్లాపురం, అవురువాడ, 23న మాడుగుల, కె.జె.పురం, 29న సత్యవరం, ఒమ్మలి, 30న పోతనపూడి, వీరవల్లి అగ్రహారం గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. నవంబర్ 5న జి. అగ్రహారం, వీరనారాయణం, 6న ముకుందపురం, ఎం. కోటపాడు, 12న సాగరం ఎం. కోడూరు, 13న తాటిపర్తి, శంకరం, 19న జె.డి.పేట, పొంగలిపాక, 20న ఎల్. పొన్నవోలు, జాలంపల్లి, 26న కింతలి వల్లాపురం, అవురువాడ, 27న మాడుగుల, కె.జె.పురం గ్రామాల్లోను డిసెంబర్ 3న సత్యవరం, ఒమ్మలి, 4న పోతనపూడి, వి.వి.అగ్రహారం, 10న జి. అగ్రహారం, వీరనారాయణం, 11న ముకుందపురం, ఎం. కోటపాడు, 17న సాగరం, ఎం. కోడూరు, 18న తాటిపర్తి, శంకరం, 24న జె.డి.పేట, పొంగలిపాక, 26న పొన్నవోలు, జాలంపల్లి, 31న కె. వల్లాపురం, అవురువాడ గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

గిరిజనులకు నిత్యావసర సరకుల పంపిణీ



గిరిజనులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సత్యసాయి భక్తులు

దేవరాపల్లి: భగవాన్ సత్య సాయిబాబా భక్తులు మారుమూల గిరిజనులకు ఆదివారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. వెంపలనగర్ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి గల్లా శంకరరావు ఆధ్వర్యంలో అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ పరిధిలో మాకనాపల్లికి చెందిన 27 గిరిజన కుటుంబాలకు వీటిని అందజేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎటూ వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో వేచలపు రామునాయుడు, రంకిరెడ్డి వెంకటేశ్వర్లు, సూర రామారావు, లెక్కల సత్యనారాయణ, వేచలపు వెంకటరమణమూర్తి తదితర సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



వేచలం హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దేవరాపల్లి: వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలియిక సందడిగా జరిగింది. 1994-95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వీరంతా సుమారు 30 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. వారంతా ఒకనొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. ఆటపాటలతో అలరిస్తూ వారంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులను అందుకున్నారు. పూర్వపు విద్యార్థుల్లో అనారోగ్య, ఆర్థిక సమస్యలతో సతమతమయ్యే వారికి అండగా నిలవడంతో పాటు పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోనెల నాగరాజు, తాతబాబు(సీఐ), కిషోర్, వేమన రామకృష్ణ, రాంబాబు, జగన్, బందారు గోపి, రెడ్డి సూర్యారావు, తమదాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీ విజేత కేజేపురం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లబండి

చీడికాడ: జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీల్లో విజేతగా మాడుగుల మండలం కేజేపురం గ్రామానికి చెందిన ఆంజనేయ ఎడ్లబండి నిలిచింది. మండలంలోని దిబ్బపాలెంలో వరసిద్ధి వినాయకుని నిమజ్జనోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో ద్వితీయ స్థానం అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన మరిడిమాంబ బండి, తృతీయ స్థానం నరసయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ, చతుర్థ స్థానం ముమ్మిన కనకరాజు, పంచమి స్థానం ఎం.కొత్తపల్లికి చెందిన నంబరు రామకృష్ణ బండి దక్కించుకున్నాయి. వీరికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నందారపు రమణబాబు, కమిటీ సభ్యులు ప్రదానం చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు వీధి పండుగలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో తాగునీరు తదితర సదుపాయాలు ఏర్పాటు చేశారు.